కథానిక

# ప్లీడరుగారి బోర్డు

సులోచన

ఈమధ్యనే మా ఉష మొగుడు బి ఎల్ ప్యాసయ్యాడు.

సామాన్యంగా తన భర్తలో ఒక ప్రత్యేకమైన విశేషం, గొప్పదనం-లోకానికి కొంచెం గౌరవంగా కనపడేది-ఉంటేసరి చాలామంది స్త్రీలు గర్వంతో కులుకుతారు; "తను ఉద్యోగస్థుని భార్య," "తను పేరు మోసిన ప్లీడరు భార్య," "తను వేలు సంపాదించే డాక్టరు భార్య," "తను చైర్మన్ భార్య." అన్నటువంటి ఒక విధమైన తృప్తి, అహంకారం, గర్వం, అందరూ తనని గొప్పగా చూడాలనే అభిలాషగల స్త్రీల మాట అటుంచి ఇంకా తన భర్తలోని ప్రత్యేక విశేషాన్ని, హోదాని లోకం తెలుసుకోక ముందే, తన భర్త ప్రసిద్ధిచెందిన ప్లీడరు కాకముందే, మా ఉషకు "తను ప్లీడరు గారి భార్య" అన్న గర్వం, తక్కిన స్త్రీలకంటే సంఘంలో తనకొక ప్రత్యేకమైన మర్యాద ఉండాలనే ఆలోచనా, అపరిమితంగా ఉండటం శోచనీయం.

మొన్న పంతులుగారింటికి పేరంటానికి వెళ్ళినప్పుడు అంతమంది ఆడవాళ్ళ మధ్య తన గొప్పదనాన్ని, ప్రత్యేకతని చాటుకోటం చూస్తే ఉషమీద నాకు ఒళ్లు మండింది. పంతులుగారి భార్య శుభమా అంటూ కాళ్లకు పసుపు రాయనువస్తే-"అహ్హా! వద్దు, వద్దు!" అని చీదరించుకొంది. పాపం! ఆవిడ ముఖంలో నెత్తురు నల్లబడింది. కాళ్ళకు పసుపు రాయించుకోవటం నాగరికతకు భంగమట. అంతే కాకుండా బహు బెట్టుగా ఉంది. పలకరిస్తేనే కాని పలకటం లేదు. ఎక్కడ దెబ్బతింటుందో! మాటిమాటికీ తన నగలవంక, చీరవంక చూసుకోవటం, చేతిగుడ్డతో ముఖం అద్దుకోవటం, క్షణక్షణానికి ముఖంలో వివిధ రకాలైన మార్పుల్ని తెప్పించటం, దూరంగా యెడంగా కూర్చోవటం-ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, అత్తయ్యలాంటి దానిని నన్ను చూసి కూడా చూడనట్లు నటించింది ఉష. "ఏమిటి దీని బోడిముండ హోదా, గొప్పతనం-జడ్జీగారి భార్య రాలేదా, కాళ్ళకు పసుపు రాయించుకోలేదా, అక్కడికి దీని ఎక్కువ యేమిటో" అనుకున్నాను నేను.

మరునాడు కాబోలు, మా వూరునుంచి ఎవరో బంధువులు ఉషవాళ్ళ యింటికివస్తే వాళ్ళను పలకరించేందుకుగాను జట్కాబండిలో నేనూ, మా రాధిగాడూ వెళ్ళాం. నేనూ, రాధిగాడూ జట్కాలోంచి దిగటం ఉష చిన్న తమ్ముడు గడపలోనుండి చూసి, తల్లిని కేకవేశాడు.

"అమ్మా! అమ్మా! సులోచనత్తయ్యా, రాధిగాడూ వచ్చారో!"

ఇంట్లోకి వెళ్ళాను. రాధిగాడు ఉష తమ్ముడితో జత కలిశాడు. వచ్చిన బంధువులతో పావుగంటసేపు కాలక్షేపంచేసి-వాళ్లని సాయంత్రం మా యింటికి తీసుకెళ్తానని చెప్పి "ఉష ఏదీ!" అన్నాను, ఉషతల్లితో.

"ఆ గదిలో ఉన్నారమ్మా! అల్లుడూ అదీ గంటసేపట్నుంచీ ఏదో బోర్డుకు నగిషీ చేస్తున్నారు. రేపు మంచి రోజు చూసి, స్నేహితులకు టీపార్టీ యిచ్చి ఆ బోర్డు కడతాడట" అన్నది ఉష తల్లి.

వాళ్ళదగ్గర కెళ్ళాను. ఆబోర్డు చూడగానే నాకళ్లు చెదిరిపోయినాయి. అంత అందంగా ఉంది. ఉష చెప్పింది: అది మద్రాసులో తయారు చేయించారుట. ఖరీదు ఎనభై రూపాయలట. ముత్యాల్లాగ ఉన్నాయి అక్షరాలు. దానిమీద "సన్యాసం నారాయణరావు, బి ఏ. బి ఎల్. అడ్వకేట్ "అని మాత్రమే ఉంది.

"ఇంత ఖరీదుపెట్టి బోర్డు చేయించటం దేనికి? మామూలుగా పదిరూపాయలకే చేయించవచ్చుగా" అన్నాను నేను. వేలకు వేలు 'సంపా

ించిన పెద్ద పెద్ద ప్లీడర్లు సహితం యింత ఖరీదు బోర్డు కట్టలేదే అనుకుంటూ.

ఉష ముఖం మాడ్చుకుంది. నా ప్రశ్న దానికి పెద్ద బాధ కలిగించినట్లుంది.

"మా వారి అభిప్రాయం అది కాదు. అంతా పరిశుభ్రంగా, నీట్‌గా ఉండాలి. బోర్డు చూడగానే మంచి అభిప్రాయం కలగాలి ఈ బోర్డు ఈ ఖరీదు ఒక లెక్కా యేమిటి? రేపట్నుంచీ ప్రాక్టీసు ఆరంభమైన దగ్గర్నుంచీ, ప్రతిభా విశేషం చాలా పెద్ద పేరూ, డబ్బూ ఆర్జించడం మొదలెట్టాక ఇవన్నీ ఒక లెక్కలోవి కావు. అప్పుడు కూడా యీ యింట్లో ఉంటామనే నమ్మకం యేమిటి?"

నాకు ఉష కనే పగటి కలలు స్పష్టంగా అర్థమైనాయి. నేను యింక యేమీ మాట్లాడదలుచుకోలేదు. ఏది మాట్లాడినా అది ఆమె హృదయంలో బల్లెంలా గుచ్చుకొని బాధిస్తుందని ఊహించిన దానినై "ఊఁ" కొట్టుతూ ఊరుకున్నాను.

తరువాత ఒకరోజు టీపార్టీ చేసి వకీలు బోర్డు కట్టాడు, ఉష మొగుడు. టీపార్టీకి పెద్ద ఖర్చే అయిందనీ, స్నేహితులంతా గొప్పగా డబ్బు సంపాదించాలని దీవించారనీ ఉష చెప్పింది. ఉష అమాయకత్వానికి నవ్వొచ్చింది ఈ సులోచన. ఉష మొగుడి భవిష్యత్తుమీద ఒక్క ఉషే కాకుండా వాళ్ళ యింట్లో కూడ మంచి నమ్మకమే ఉందని నేను అనుకోటానికి కొంత కారణం లేకపోలేదు.

ఒకటి రెండుసార్లు ఉష తల్లి నాదగ్గర ఈ విధంగా అన్నది:

"ఈ కాలంలో ప్లీడర్ల సంపాదన మహా జాస్తిగా ఉంది. ఆ రామశాస్త్రిగారు బోర్డు కట్టి ఆరునెల్లు అయిందో లేదో అప్పుడే పొలం బేరం చేస్తున్నాడని విన్నాను. మా అల్లుడు కూడా..." మిగతా భావం ఎవరైనా తేలిగ్గా ఊహించుకోగలరు. ఉష తండ్రి అల్లుడ్ని లా చదవమని ప్రోత్సహించటంలో గల అంతరంగిక అభిప్రాయం కూడా అదేనని వేరే చెప్పనవసరంలేదు.

* * *

నారాయణరావుగారు ఇంటిని కొన్ని భాగాలుగా విభజించారు. అందులో ప్రత్యేకంగా చెప్పుకో తగింది ఏమిటంటే తన ఆఫీసు గది. ఎంతో శ్రద్ధతో నాజూకుగా చేసిన పన్నెండు కుర్చీలు, మధ్యలో పెద్ద డ్రాయరు, డ్రాయరుమీద గుడ్డ, కొన్ని కాగితాలు, ఫైళ్ళు సిరాబుడ్లు, కలాలు, బెల్ మొదలైన అవసరమైన వస్తువులు, గదిలో మూడు అద్దాల బీరువాలనిండా లా పుస్తకాలు, గోడలకు నీలపు రంగు, అక్కడక్కడ జాతీయ నాయకుల చిత్రాలు ఉన్నాయి. గది ఎప్పుడు చూసినా అందంగా ఉండేట్టు యేర్పాట్లు చేయబడ్డాయి. ప్రక్కన ఇంకో చిన్న గదిలో గుమాస్తా ఉంటాడు. నెలకు 75 రూపాయలు ఇచ్చేట్లు, ఒక గుమాస్తాని మాట్లాడాడు నారాయణరావు.

ఎప్పుడు కాఫీ కావాలంటే అప్పుడు కాఫీ తయారుచేసి యిచ్చేట్టు ఉండాలని ఉషను హెచ్చరించాడు. సరే నన్నది ఉష. భర్తకు అదృష్టం కలిసివచ్చి ప్రాక్టీసు బాగా నడవాలే కాని ఉషరోజుకు యాభైమందికైనా గాని కాఫీ తయారుచేసి యివ్వగలదు. నారాయణరావు ఉద్దేశం ఏమిటంటే తన దగ్గరకువచ్చే దావాదారుల్ని, నేరస్థుల్ని ఎక్కువ తక్కువ లేకుండా సమానంగా ఆదరించాలని. ఆయన ఇంకో విధంగా కూడా తలచాడు; అందరు ప్లీడర్లలాగా కాకుండా తనకి న్యాయంగా ఖ్యాతి రావాలి. బీదవాళ్ళదగ్గర తను డబ్బు గుంజకూడదు. పైపైకి పోనీయాలి. ఆ వార డబ్బున్న వాళ్ళదగ్గర గుంజవచ్చు. స్వార్థంలేకుండా అతి న్యాయంగా కోర్టులో వాదించాలి. సాధ్యమైనంతవరకూ, ప్రతి కేసూ గెలిపించి తీరాలి.

గడియారం ఏడుకొట్టింది తెల్లని దుస్తులు ధరించి పచారు చేస్తున్నాడు నారాయణరావు. ఇంటిముందు బోర్డును చూసి, బజారునపోయే పెరుగు తపాళా తీసుకుపోయే శాస్త్రులు నిముషంసేపు ఆగి-నవ్వుకుంటూ పోవటం చాలా గర్వాన్ని కలిగించింది నారాయణరావుకు. తనలో తాను నవ్వుకున్నాడు. ఒళ్ళు గరి పొడిచింది.

తన బోర్డు బజారునపోయే ప్రతివాణ్ణీ యిట్టే ఆకర్షిస్తుంది. ముఖ్యంగా యిక కేసులు గలవాళ్ళను, దావాలు వేసేవాళ్ళను ఆకర్షించ

టంలో, తన గొప్పతనాన్ని వ్యక్తీకరించటంలో ఆశ్చర్యమేముంది?—అనుకున్నాడు నారాయణరావు. ఉష కాఫీ తెచ్చి డ్రాయరు మీద పెట్టింది. కాఫీ చప్పరిస్తున్నాడు నారాయణరావు. ఉష బయటకు వీధి గడపలోకి వెళ్ళింది. ప్రక్కగదిలో గుమాస్తా వీరాస్వామి పుస్తకానికి దూళ్ళు కొట్టుకుంటున్నాడు.

"బజారునపోయే ప్రతివాడూ ఆగి మీ బోర్డువంక చూసి మరీ పోతున్నాడు" అన్నది ఉష ఇంట్లోకి వస్తూ.

"మరి..." అన్నాడు నారాయణరావు విజయగర్వంగా నవ్వుతో. ఉష హృదయం సంతోషంతో నిండుకుంది.

పదిన్నర దాటింది. తెల్లప్యాంటూ, నల్ల కోటూ, బూటూ, హ్యాటూ ధరించి అద్దంలో చూసుకున్నాడు నారాయణరావు. "అమోఘంగా ఉన్నారు" అన్నది ఉష.

"నిజంగా" అనుకొని మురిసిపోయాడు నారాయణరావు. కాని ఆ వేషంతో కోర్టు కెళ్ళాల్సిన అవసరం యింకా కలగలేదు. పార్టీలవారికోసం అమర్చిన కుర్చీలమీద ఎవ్వరూ కూర్చోవటం జరగలేదు.

మరునాడు ఎవ్వరూ రాలేదు. "ఇంకా మన విషయం బస్తీ అంతా ప్రాకి ఉండదు" అన్నాడు నారాయణరావు.

"నిజమే" అన్నది ఉష.

మూడోరోజూ, నాలుగోరోజూ, అయిదో రోజూకూడా నారాయణరావు దగ్గరకు ఏవిధమైన పార్టీవాళ్లు రాలేదు నారాయణరావు ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి చెప్మా?" అనుకున్నాడు నారాయణరావు.

"తన భర్త ప్రతిభ ఇంకా అందరికీ తెలిసి ఉండదు" అనుకుంది ఉష.

"అల్లుడు బోర్డుకట్టిన వేళ మంచిది కాదేమో!" అనుకుంది ఉష తల్లి.

"ఇంకా రోజులుగడిస్తే కాని రారు దావాదారులు. పల్లె పట్టులంతా తెలిసిపోవాలి" అన్నాడు గుమాస్తా వీరాస్వామి, ఎంతో అనుభవం కలవాడిలాగ.

వారం—రెండు వారాలు—గడిచాయి.

ఫలానా వారిమీద దావా వేయాలి, ఫలానా కేసుకు మీరు ప్లీడరుగా పనిచేయాలి, ఫలానా ఆస్తికోసం దావా వెయ్యదలుచుకున్నాను మీ సలహా ఏమిటి,—అని ఒక్కడైనా నారాయణ రావుగారి దగ్గరకు వచ్చిన పుణ్యాన పోలేదు. నారాయణరావుకు మనశ్శాంతి లేకుండా ఉంది. కనపడ్డ స్నేహితుడల్లా "అప్పుడే ఎన్ని కేసుల్ని చేపట్టావు? ఎంతడబ్బు గుంజావు" అడిగేవాడే. ఏమని సమాధానం చెప్పి తన పరువును కాపాడుకోగల్గట్టు?

రోజూ పొద్దున కాఫీ తాగింది మొదలు రాత్రి భోజనంచేసేవరకూ మాటిమాటికీ బజారు వంక చూడటం—ఎవరైనా తన దగ్గరకు దావా వేసేందుకు వస్తున్నారేమోనని, తన సలహాకోసం యెవరైనా వస్తున్నారేమోనని, (సలహా ఫీజు లేకుండా చెప్ప నిశ్చయించుకున్నాడు నారాయణరావు) ప్రతివారూ అందమైన బోర్డువంక చూడటం, తమదోవని తాము పోవటం—నారాయణరావుకు చాల విసుగును నిరాశని కలిగిస్తోంది.

"ఏమిటీ దౌర్భాగ్యం. మనదగ్గరకు ఎవరూ రారే! ఇన్ని వేలు ఖర్చుపడి 'లా' చదివి బోర్డు కట్టి ఊరికే నే చేతులు నలుపుకుంటూ కూర్చోవటమా! ఈ కోర్టుకు వెళ్ళేవాళ్ళకు మతులు ఉండనట్లుగుందే!—చినిగిపోయినకోట్లుధరించీ, ఇంటిచుట్టూ మురికినీరు ఉండి. దుర్భరమైన వాసనకొట్టే పాతప్లీడర్ల యిళ్ళకు వెళుతారు. వందలకు వందలు ఖర్చుపెడతారు. మనదగ్గరకు—ఇంత నీటుగా ఉండే మనదగ్గరకు—ఒక్కడూ రాడే. ఒక్కడుకూడా" అన్నాడు నారాయణరావు

గుమాస్తా మాట్లాడలేదు. ఈ విపరీతానికి కారణమేమిటో ఊహిస్తోంది ఉష.

"ఇక నీవు ఓపిక చేసుకొని నీ జీతం డబ్బులకైనా ఎవర్నో ఒకర్ని తీసుకురా!" అన్నాడు నారాయణరావు.

"సరే" అన్నాడు గుమాస్తా వీరాస్వామి.

ఎలాగనైతేనేమి వీరాస్వామి వాళ్ళ అమాకీ వీళ్ళ అమాకీ తెలుసుకొని మూడో రోజు సాయంత్రానికి ఒకదావాదార్ని తీసుకు వచ్చాడు. నారాయణరావు వీరాస్వామి వైపు

ర్యానికి మెచ్చుకున్నాడు లోలోపల. ఉష కాఫీ యిచ్చింది. అందరూ కాఫీ సేవించటం అయింతరువాత—

"ఏమిటి?" అన్నాడు నారాయణరావు ప్లీడరుకు ఉండవలసిన గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుంటూ.

"మా తండ్రినుంచి నేను వేరుపడాలి. మా తండ్రి అందుకు ఒప్పుకోవడంలేదు. అందుకోసం దావా వేయ దలుచుకున్నాను." అని మూడు వాక్యాలలో ముక్తసరిగా ముగించాడు ఆవ్యక్తి. ఇంకా ఆ వ్యక్తితోపాటు ముగ్గురు మనుష్యులు వచ్చారు.

"తండ్రి వొట్టి దుర్మార్గుడులెండి. రెండో పెళ్ళిచేసుకున్న దగ్గర్నుంచీ మొదటి సంబంధం కొడుకువిషయం అసలు మర్చిపోయాడు. సవితి తల్లి వాడిని పెట్టేబాధలు అంతులేవు అందుకోసమే భాగం పంచి యివ్వమని అడిగితేససేమిరా వల్లగాదన్నాడు."—యింకొక వ్యక్తి.

"సరే! బాగుంది. మైనరు వెళ్ళిందిగా" అన్నాడు నారాయణరావు.

"మైనరు వెళ్ళకపోవటమేమిటి? ఒక పిల్లవాడుకూడాను" అన్నాడు మూడోవ్యక్తి.

"ఆల్ రైట్! మంచి పట్టుదలతో పనిచేసి ఈ దావాను గెలిపించగలను." అన్నాడు నారాయణరావు.

"అయితే మీకెంత యివ్వమంటారు" అన్నాడు దావా వేయదలుచుకున్న వ్యక్తి.

నారాయణరావు కొంచెంసేపు ఆలోచించి "ఒక్క నాలుగొందలైనా యివ్వవలసి ఉంటుంది" అన్నాడు.

"అబ్బో! అంత యిచ్చుకోలేం— పేదవాళ్ళం ఇంకా చాలా తగ్గించాలి." అన్నాడు వ్యక్తి.

"ఎంతయిచ్చుకోగలవు?" అన్నాడు నారాయణరావు, మొదటికేసును విడిచిపెట్ట దలుచుకోక. ఈ కేసేగనుక గెలిస్తే క్రమేపీ తను అగ్రస్థానంలోకి పోవొచ్చు.

"రెండువందల యాభై పైన చిల్లిగవ్వయినా ఇచ్చుకోలేనండి" అన్నాడావ్యక్తి.

"సరే" అన్నాడు నారాయణరావు.

"రేపువస్తాం. ఏడుగంటలకల్లా వస్తాం." అంటూ వాళ్లు లేచారు. అడ్వాన్సు విషయం జ్ఞాపకానికి వచ్చి రేపు వస్తారుగదా అని వూరుకున్నాడు నారాయణరావు

మరునాడు ఏడుగంటలకు వాళ్లు రాలేదు, సరిగదా మూడోనాడు యేడుగంటలకుకూడా రాలేదు. నారాయణరావుకు అర్థంకాలేదు.

"వీరాస్వామీ! వాళ్లు ఇంకా రాలేదేం? ఏం జరిగిందో. కొంపతీసి తండ్రీ కొడుకూ రాజీ పడ్డారేం? మనకు ఆదిలోనే ఇటువంటి వాళ్లు దొరికినందుకు చెప్పుకోవాలి. నువ్వు కాస్త ఓపిక చేసుకొని అసలు సంగతి కనుక్కురా. అక్కడికి డబ్బుకక్కు వకేఒప్పుకొంటిమి." అన్నాడు.

"సరే" అంటూ వెళ్ళాడు వీరాస్వామి. తన జీతం డబ్బులకైనా తిప్పలు పడకపోతే లాభం లేదు అనుకున్నాడు వీరాస్వామి.

మసకచీకటి పడుతూండగా వీరస్వామి వచ్చాడు "ఏమిటి - వాళ్ళని తీసుకొస్తున్నావా?" అన్నాడు నారాయణరావు.

"వాళ్లు ఇంకో ప్లీడరుదగ్గరకు వెళ్ళారు."

"ఆఁ!—నిజంగా"

"వాళ్లు చెప్పారు. ఆ డబ్బుకే పాతప్లీడరు, ప్రాక్టీసుగలాయన, కేసు గెలిపించే బాధ్యత తనదని ఒప్పుకున్నాడుట. ఇంకా పైగా ఇట్లా అన్నారు. మీ ప్లీడరేం కేసు గెలిపిస్తాడయ్యా! నిన్న గాక మొన్న ప్యాసైవచ్చాడు. కోర్టులో ఏం వాదించగలడు. ప్రాక్టీసులేదు-దావా గెలిపిస్తాడట!" అన్నాడు వీరాస్వామి.

నారాయణరావు ముఖం, ద్వారందగ్గర ఉండి ఈ మాటలు విన్న ఉష ముఖం, సరిసమానంగా తెల్లబడ్డాయి. వీరాస్వామి తల గోక్కున్నాడు-కర్తవ్యం ఏమిటని.

ఉష తమ్ముడికి జ్వరంగా ఉందంటే నేనూ, మా రాధిగాడూ ఉషవాళ్ళ యింటికి వెళ్లాము. జట్కా దిగి ఇంట్లోకి వెళ్ళబోతూ గోడవంక చూశాను. విపరీతమైన ఆశ్చర్యం కలిగింది.

ఏదీ నారాయణరావుగారి వకీలు బోర్డు— ఎనభై రూపాయల విలువగలది, అందమైంది- లేదు. ఏమిటబ్బా అనుకుంటూ లోపలకెళ్లాను.

ఉష తమ్ముణ్ణి చూసిన తరువాత, ఉషని చాటుగా గదిలోకి పిలిచి,—

"మీవారి వకీలుబోర్డు ఏదీ?" అన్నాను.

ఉష ముఖంలో నెత్తురు ఆ క్షణంలో ఘనీభవించింది. రెండు నిముషాలదాకా నాకు సమాధానం చెప్పలేకపోయింది.

"వైధవ ప్లీడరు ఉద్యోగం దేనికి–మానుకోమని మా నాన్నగారు అన్నారు" అని అబద్ధం ఆడింది కళ్లల్లోకి నీళ్లు తెచ్చుకుంటూ. ఉష నాన్న అట్లా అంటాడని నేను విశ్వసిస్తానని, ఉష ఎందుకు భ్రమపడిందో నాకు అర్థంకాదు.

---

# నేటి భారతం

సా. జోగిరాజు

'మా ఆయన జీతం కొంతే ఐనా
నెలనెలకూ నాకెంతో యిస్తార్
వర్తకులంతా ఆనందాన్ని
పర్శిస్తార టాయన జేబుల్లో.'

"అవునమ్మా, అవునవునమ్మా"

'కట్టలు కట్టలు కాగితాల
కరువును మోసుక నా మొగుడొస్తే
జీతంచాలక అప్పులు పుట్టక
ఏడుస్తూంటాం నెత్తినిగొట్టుక.'

"అయ్యో తల్లీ! ఏమిచేయనే, అయ్యోతల్లీ"

'పుస్తెను అమ్మిన చేత్తోనే
వస్తువులెన్నో చేయించార్
ఎండిన మండిన మనకు నిత్యమూ
పండుగే న నంటారు నాపతి.'

"అవునమ్మా, అవునవునమ్మా"

'కూలికి పోయినవాడు తినుటకై
చాలని మెతుకులు సరిపెట్టుటకై
పరుల పాపాయి కడుపు నింపుదును
కరువున బుట్టిన బిడ్డ జంపుదును'

"అయ్యోతల్లీ అయ్యోతల్లీ"

'లాఠీ దెబ్బలు తినకుండానే
కోటికి పడగల నెత్తనుంటిమి
గాంధీటోపీలోని మహత్మ్యం
గాలికి పోదని నాథుడు నవ్వును.'

"అవునమ్మా అది నిజమమ్మా"

'నలబైరెండో నాటి విప్లవం
నా కొడుకును బలిగా మింగింది
ఉన్న సమస్తం దేశానికనై
ఊడ్చితి తిరిపెం నేనెత్తుచుంటి.'

"శాంతం పాపం శాంతం పాపం"